గ్రూప్-1 మెయిన్స్‌లో మానుకోట విద్యార్థి ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో 323వ ర్యాంకు

జశ్వంత్ రాజ్

మహబూబాబాద్ రూరల్, మార్చి 30: గ్రూప్-1 మెయిన్స్ ఫైనల్ లిస్టులో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సంగాల జశ్వంత్ రాజ్ ప్రతిభ చాటుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన సంగాల రవికుమార్, ప్రసన్న దంపతుల కుమారుడు జశ్వంత్ రాజ్ 900 మార్కులకు గాను 465 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 323వ ర్యాంకు, మల్టీ జోన్ స్థాయిలో 139వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-1 మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటిన జశ్వంత్‌రాజ్‌ను కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించి, ఆనందం వ్యక్తం చేశారు.

కేసముద్రం వాసికి ఎస్సీ కేటగిరీలో 33వ ర్యాంకు

విష్ణు

కేసముద్రం, మార్చి 30 : గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో కేసముద్రం మండలం తిమ్మంపేటకు చెందిన విష్ణుకు ఎస్సీ కేటగిరిలో 33వ ర్యాంక్ సాధించాడు. తిమ్మంపేట గ్రామానికి చెందిన గూడెల్లి ముత్తయ్య- లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు విష్ణు 2018 డీఎస్సీలో ఉద్యోగం పొందాడు. కురవి మండలం మోదుగులగూడెం ప్రభుత్వ పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష రాశాడు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో 442.5 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో జనరల్ కేటగిరీలో 791 ర్యాంక్, ఎస్సీ కేటగిరిలో 33వ ర్యాంక్ సాధించాడు. విష్ణు సోదరుడు శంకర్ కూడా 2011లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో ర్యాంక్ సాధించి వ్యవసాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ముత్తయ్య-లక్ష్మి దంపతులు కష్టపడి వ్యవసాయం చేస్తూ ఇద్దరు కుమారులను చదివించారు. వారి కష్టాన్ని గుర్తించి శంకర్, విష్ణు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

మల్లన్న ఆలయ హుండీ చోరీ

మరిపెడ, మార్చి 30 : మల్లన్న దేవాలయంలో దొంగలు పడి హుండీని ఎత్తుకెళ్లిన ఘటన శనివారం రాత్రి మండలంలోని వీరారంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం ఉగాది పండుగ పురస్కరించుకొని యాదవ కులస్తులు పుజలు చేయడానికి మల్లన్న గుడికి వెళ్లిన క్రమంలో గుడి తలుపులు తెరచిఉన్నాయి. లోపలికి వెళ్లగా ఆలయంలోని హుండీ చోరికి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు యాదవ కులస్థులు తెలిపారు.

గ్రామ పంచాయతీల్లో పైసల్లేవ్!

- ఏడాది గడిచినా నిర్వహణకు నిధులు ఇవ్వని ప్రభుత్వం
- అస్తవ్యసంగా గ్రామాలు
- ఆర్థికభారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే..
- జిల్లాలోని 461 గ్రామాల్లో ఇదే పరిస్థితి

చాప్ల తండా గ్రామ పంచాయతీ కార్యాలయం(ఫైల్)

డోర్నకల్, మార్చి 30 : గ్రామ పంచాయతీలకు ఈ ఆర్థిక సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క రుపాయి కూడా విడుదల కాలేదు. దీంతో గ్రామ పంచాయతీ నిర్వహణ మొత్తం పంచాయతీ కార్యదర్శులపై పడింది. ఏడాదిగా వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామ పంచాయతీని నడిపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి, పనిభారం కూడా పెరిగింది. అధికారులు, అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు ఏమి చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. కనీసం వీధి దీపం చెడిపోయినా మార్చేందుకు డబ్బులు లేవు. గ్రామాల్లో ఇంటి పన్నుల ద్వారా వచ్చిన డబ్బులు రోజు వారీగా ఖర్చులకు ఉపయోగిస్తున్నారు. చెత్త సేకరణ, ట్రాక్టర్ ఉపయోగించడం, డిజిల్ ఖర్చులు, పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ ఇతర వస్తువులు కొనుగోలుకే అవి సరిపోతున్నాయి. బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు చేసిన ఖర్చుల చెల్లింపులకు సంబంధించిన చెక్కులు 15 నెలలుగా ట్రెజరీలోనే పెండింగ్‌లో ఉన్నాయి. చిన్న గ్రామ పంచాయతీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పంచాయతీల్లో పనులు చేయకపోతే గ్రామస్తులు కార్యదర్శులను నిలదీస్తున్నారు. వారికి ఏ సమాధానం చెప్పాలో అర్థం కాక కార్యదర్శులు అయోమయంలో పడిపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో పన్నులు వసూళ్లు చేసిన సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. రెండు, మూడు నెలలకు మాత్రమే జీతాలకు సరిపోతున్నది.గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన పెట్టింది. పేరుకే ప్రత్యేక అధికారులు కానీ ఏ రోజు గ్రామ పంచాయతీ సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామాలకు ప్రత్యేక అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. గ్రామ స్థాయిలో ఏ చిన్న మీటింగ్ జరిగినా పంచాయతీ కార్యదర్శులు జేబుల నుంచి డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వాహణ, తాగునీటి బోర్ల మరమ్మతు, పైపు లైన్ల మరమ్మతు, లీకేజీలు, తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ఇలా ఎన్నో పనులు తమ సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తున్నదని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సేవలు సకాలంలో అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నెల నెలా నిధులు ఇవ్వక పోవడంతో అభివృద్ధి పనులు ఏమీ జరుగడం లేదు. మహబూబాబాద్ జిల్లాలో461 గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా నిధులు మంజూరు చేయాలని స్థానికులు, అధికారులు కోరుతున్నారు.

పల్లెలో అభివృద్ధి నిలిచిపోయింది

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. అయినా పల్లెల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో కోత పెడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో ఏన్నో అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేయాలి.

– సీహెచ్ రామచంద్రయ్య, తోడేళ్ల గూడెం

కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

సమాజ వికాసానికి దోహద పడాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : విశ్వావసు నామ ఉగాది సంవత్సరం సమాజ వికాసానికి దోహదపడాలని శుభోదయం సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణం బ్యాంక్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో ప్రముఖ రచయిత్రి సంకెపల్లి కీర్తనరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరం సమాజంలో రుగ్మతలు నిర్మూలించి, ప్రేమ, అభిమానం, క్రమశిక్షణ, మానవత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కవులు తమ కవితా పఠనంతో అలరించారు. అనంతరం కవులందరినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అసోసియేట్ అధ్యక్షుడు డీ వెంకట్‌రెడ్డి, విశిష్ట అతిథి గుర్రం సత్యనారాయణ, బొడ్ల వెంకయ్య, శ్రవిక, వైద్యుతి, నాగేంద్ర నాగేశ్వర్‌రావు, నీలం వెంకటేశ్వర్లు, గొలుగోపు కవిత, అమర్నాథ్, వీరస్వామి, శంకరాచారి, వినోద్ కుమార్, పాపయ్య, లక్ష్మీకాంతారావు, కల్లూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

అధికారుల నిర్లక్ష్యంతోనే మరుగుదొడ్ల నిధులు వెనక్కి

మరిపెడ, మార్చి 30 : ఎంపీడీవో, గ్రామ కార్యదర్శుల నిర్లక్ష్యంతో మండలంలోని స్వచ్ఛభారత్ మరుగుదొడ్ల నిధులు వెనక్కి వెళ్లినట్లు సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ఆరోపించారు. ఆదివారం పురపాలక సంఘం పరిధిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మరుగుదొడ్లు లేని నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో లబ్ధిదారుడికి రూ.12 వేల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో 44 పంచాయతీలకు సుమారు రూ.కోటి నిధులు రాగా, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించకపోవడం వల్ల వారు ఈ పథకాన్ని ఉపయోగించుకోలేదని పేర్కొన్నారు.. మంజూరైన నిధులు తిరిగి వెనక్కి వెళ్లడం అధికారుల నిర్లక్ష్యానికి కారణమేననారు. ఇప్పటికైనా ఎంపీడీవో, కార్యదర్శి క్షేత్రస్థాయిలో విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, నారాయణ, అంజి పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల కలకలం

పురాతన శివాలయంలో డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రాలు

డోర్నకల్ : తోడేళ్ల గూడెం శివారు గుట్ట వద్ద తవ్విన గుంత

మహబూబాబాద్ రూరల్, మార్చి 30 : మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కంబాలపల్లిలోని పురాతన ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు ఆదివారం కలకలం రేపాయి. గ్రామస్తుడు వెంకన్న తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామంలోని పురాతన శ్రీరాజరాజేశ్వరీ దేవాలయంలో అర్చకుడు రోజు మాదిరిగానే శనివారం రాత్రి స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి అనంతరం ఆలయానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉగాది పండుగ వేళ ఆలయానికి వచ్చి చూడగా ఆలయ గర్భ గుడి గోడకు గుప్తనిధుల కోసం డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రం చేసినట్లు ఉంది. ఉగాది రోజు స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన అనవాళ్లను చూసి అవాక్కయ్యారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని, కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతన ఆలయాల్లో పురావస్తు శాఖ పరిశోధనలు జరిపి వాటి ప్రతిష్టను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఈ ఘాతుకానికి పాల్పడిన దుండగులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

తోడేళ్లగూడెం శివారులో..

డోర్నకల్ : తోడేళ్ల గూడెం శివారులోని శ్రీ వల్లి సుబ్రహ్మణ్య స్వామి గుట్ట వద్ద శనివారం రాత్రి గుప్త నిధులు కోసం కొందరు తవ్వకాలు చేపట్టారు. ఆదివారం ఉదయం స్వామి వారి దర్శనం కోసం వెళ్లిన భక్తులు చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. శ్రీ వల్లి సుబ్రహ్మణ్య స్వామి గుట్ట వద్ద రెండు చోట్ల గుప్త నిధులకు తవ్వకాలు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు వెంటనే దుండగులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎల్ ఆర్ఎస్‌ను నిరంతరం కొనసాగించాలి

తొర్రూరు, మార్చి 30 : ఎల్ఆర్ఎస్ విధానాన్ని నిరంతరం కొనసాగించాలని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి అన్నారు. తొర్రూరు పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చిందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలు చిన్నచిన్న ప్లాట్లు కొనుగోలు చేసి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని చూస్తున్న సమయంలో ఎల్ఆర్ఎస్ భారం మోపడం సరికాదన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తున్న నేపథ్యంలో మళ్లీ ఎల్ఆర్ఎస్ రూపంలో అదనపు భారం వేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవడం కోసం ప్రజలపై భారం మోపవద్దన్నారు. ఎల్ఆర్ఎస్‌ను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ, గడువు విధించకుండా, అవసరమైతే ఫీజులో మినహాయింపు ఇవ్వాలని కోరారు.

తొర్రూరు మున్సిపాలిటీపై ఇంటెలిజెన్స్ ఆరా..!

తొర్రూరు, మార్చి 30 : తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో అక్రమ భవన నిర్మాణ అనుమతుల వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందని, భవన అనుమతుల కోసం నిర్దిష్ట మొత్తంలో లంచం ఇవ్వాల్సిందేనని, లేకపోతే అనేక విధాలుగా ఇబ్బందులు కలిగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.10వేల నుంచి రూ.20వేల వరకు లంచం లేకుంటే భవన అనుమతులు నిరాకరించే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వలేని వారి స్థలాలను ఇండస్ట్రియల్ ఏరియా, బఫర్ జోన్ అంటూ చూపిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం ఇంటెలిజెన్స్ అధికారుల దృష్టికి వెళ్లడంతో, మున్సిపాలిటీపై సమగ్ర విచారణ ప్రారంభమైనట్లు సమాచారం. సంబంధిత అధికారులను ప్రశ్నించే అవకాశం ఉందని, అక్రమ లావాదేవీలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు తెలిసింది. ఈ పరిణామాలు ఎలా మారతాయో వేచి చూడాల్సిందే.

ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్ పంజా

- పండుగ పూట ఆకేరు వాగులో ఆకస్మిక రైడ్
- ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇసుక ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న తహసీల్దార్ రాజు

నెల్లికుదురు, మార్చి 30 : తెల్లవారితే పండుగ.. అర్ధరాత్రి దాటితే అధికారులెవ్వరూ ఉండరు.. ఇసుక తోడుకున్నోనికి తోడుకున్నంత అని భావించి అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఆదివారం తెల్లవారు జామున ఆకేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ముందే పసిగట్టిన నెల్లికుదురు తహసీల్దార్ కే రాజు ఆకస్మికంగా తన సిబ్బందితో కలిసి ఆకేరు వాగులో రైడ్ చేశారు. అక్కడ అక్రమంగా ఇసుకను రవాణా చేయడానికి లోడ్ చేసుకుని సిద్దంగా 5 ట్రాక్టర్లు ఉండగా, మరో ట్రాక్టర్ అప్పుడే లోడింగ్‌కి సిద్ధమవుతున్నది. తహసీల్దార్‌ను చూడగానే కొంతమంది ట్రాక్టర్లను అక్కడే వదిలేసి పారిపోయారు. దీంతో తహసీల్దార్ స్వయంగా ట్రాక్టర్‌ను నడుపుకుంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆకస్మికంగా ఆకేరు వాగులో రైడ్ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను రవానా చేస్తూ నెల్లికుదురుకు చెందిన 3 ట్రాక్టర్లు, బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన 3 ట్రాక్టర్లు పట్టుబడ్డాయని తెలిపారు. ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసి, నెల్లికుదురు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకేరు వాగును తోడేస్తున్నారు..

- చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా
- రాత్రి వేళ లో జోరుగా దందా
- పట్టించుకోని అధికారులు

రాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్

నర్సింహులపేట, మార్చి 30 : అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవడంలో అధికారులు విఫలం కావడంతో దందాదారులు ఆకేరువాగును తోడేస్తున్నారు. నెల రోజుల పాటు వాగునుంచి ఇసుక రవాణా కాకుండా డేరాలు వేసి మరీ కాపాల కాసిన అధికారులు ఒకసారిగా వాటిని ఎత్తి వేయడంతో ఇసుక దందాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఏమైందో?.. ఎవరు ఆదేశించారో.. బెదిరించారో తెలియదు కానీ, ఉన్నఫలంగా చెక్‌పోస్టులను అధికారులు ఎత్తివేశారు. దీంతో మూడు రోజులుగా ఇసుక దందా జోరుగా సాగుతోంది. రాత్రి సమయంలో ఆకేరు వాగులో సుమారు 100 ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేస్తూ దోచుకుంటున్నారు. కొంతమంది నాయకులు అధికారులతో కుమ్మకై తమ ట్రాక్టర్లతో రాత్రి వేళ్లలో యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మండలంలోని కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, జయపురం, కొమ్ములవంచ, ఫకీరతండా శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి వాగులో నీరు నిల్వ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే దళారులు మాత్రం ఇసుకను తోడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగి వరి పంటను కాపాడేకుందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో వాగులో నీటి కోసం ఏర్పాటు చేసిన మోటర్లు స్టాటర్లు సైతం అపహరణకు గురవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగును నమ్ముకుని పంటలు పండించే అవకాశం లేకుండా ఇసుక తరలిస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకోవాలని కోరుతున్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఇనుగుర్తి, మార్చి 30 : మండల కేంద్రానికి చెందిన ఆవుల వెంకన్న ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుమారుడు రవిచంద్ర స్నేహితులు ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.13వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో షేక్ యాకూబ్‌పాషా, రచన, సాయి, రఘు, అశోక్, శ్రీకాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖాన రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు

రోడ్డుపైనే మురుగునీరు

దంతాలపల్లి, మార్చి 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన రోడ్డుపై మురుగు నీరు పారుతుండడంతో దుర్వాసన వచ్చి రోగులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీధిలో డ్రైనేజీ లేకపోవడంతో ఇండ్లలోని వృథా నీరు సీసీ రోడ్డుపైనే ప్రవహిస్తున్నది. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది ఇంకుడు గుంతల నిర్మాణంపై గ్రామస్తులకు అవగాహన కల్పించకపోవడంతో ఎవరూ వాటిని వినియోగించడం లేదు. దీనికి తోడు డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై చేరుతోంది. ఫలితంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

సరుకులు అందజేస్తున్న సుమేర్ చంద్, సుశీల్ కుమార్

డోర్నకల్, మార్చి 30 : రంజాన్ పండుగ సందర్భంగా 108 వాహనం పైలెట్ సైదులకు డోర్నకల్ పట్టణానికి చెందిన వ్యాపారులు కాలా సుమేర్ చంద్ జైన్, కాలా సుశీల్ కుమార్ జైన్ సోదరులు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాసిక అశోక్, కాలా ఆకాశ్ జైన్ పాల్గొన్నారు.

కొండలమ్మ తల్లి జాతర

డోర్నకల్, మార్చి 30 : పినిరెడ్డి గూడెం సమీపంలో కొండలమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకం

★హన్మకొండ సమీపంలోని యాదవనగర్ పెట్రోల్ పంప్ రెడ్డిపురం ప్రాంతంలో సాయికృపా కాలనీలో రెండు కొత్త తూర్పు ముఖంగా187 గజాల ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి.
Cont: VRN Developers & Builders-9700101918.
NTW-000

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఘనంగా ఉగాది వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

కురవి/తొర్రూరు/నర్సింహులపేట/ డోర్నకల్/ నెల్లికుదురు/ చిన్నగూడూరు/ దంతాపల్లి/ కేసముద్రం/ బయ్యారం, మార్చి 30 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. అలాగే, కురవి, సీరోలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఉగాది పచ్చడి, బచ్చాలు(బొబ్బట్లు) చేసుకుని పండుగను జరుపుకున్నారు. సాయంత్రం కురవి వీరభద్రస్వామి ఆలయ ముఖ మండపంలో అధికారులు, వేదపండితులు, పూజారులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈవో సత్యనారాయణ, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తొర్రూరులోని పాటిమీద ఆలయంతోపాటు వేంకటేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో అర్చకులు ఓలేటి యాదగిరి చార్యులు, గీతా చార్యులు, శివశర్మతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. నర్సింహులపేట మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, నరసింహస్వామి దేవాలయాల్లో అర్చకులు పంచాంగం చదివి వినిపించారు. కార్యక్రమంలో నందనాచార్యులు, రామాచార్యులు, శేఖర్, యోగానందా లక్ష్మీ నరసింహస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. డోర్నకల్‌లోని పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు రామనుజచార్యులు పంచాంగం వినిపించారు. అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కేసముద్రం మండలం కల్వల గ్రామంలో జరిగిన పంచాంగ శ్రవణంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లింగాల పిచ్చయ్య, గ్రామస్తులు చింతనూరి వెంకన్న, పెరుమాండ్ల ఎల్లగౌడ్, గంట రాంమోహన్‌రెడ్డి, గంట బాలకృష్ణారెడ్డి, గండి శ్రీనివాస్, సామల వెంకన్న, ఏదునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. బయ్యారంలోని కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో పురోహితులు సుదర్శనాచారి పంచాంగ శ్రవణం నిర్వహించారు. అలాగే ఆలయానికి పల్లకి, ముఖద్వారాన్ని దాతలు చెవి గోపి, దూదిపాల రాజేశ్ దంపతులు అందించగా, పురవీధుల్లో ఊరేగింపుగా వాటిని ఆలయానికి తీసుకొచ్చారు. నెల్లికుదురు, దంతాలపల్లి మండలాలతో పాటు చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి, జయ్యారం, విస్సంపల్లి, గుండంరాజుపల్లి తదితర గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నగూడూరు శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

కురవి: ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న అర్చకులు

తొర్రూరు : పంచాంగ శ్రవణం నిర్వహిస్తున ప్రధాన అర్చకుడు

నర్సింహులపేట : వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

డోర్నకల్ : శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

చిన్నగూడూరు : రామాలయంలో..

బయ్యారం : రామాలయంలో..